


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

వైఎస్ఆర్ కడప

సోమవారం 23 జూన్ 2025

పేజీలు - 08


# నవ్వి పోదురు... మాకేంటి..?



**కడప బ్యూరో - మేజర్‌న్యూస్ :** కడప నగరపాలక సంస్థ నవ్వులపాలవుతోంది. ప్రజల్లో చులకనభావం ఏర్పడింది. ఆధిపత్యపోరుతో వైసీపీ మేయర్ సురేష్ బాబు, టీడీపీ ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి పంతానికి పోతున్నారు. నగర ప్రజలను గాలికి వదిలేశారు. ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. ఎవరు ఎలా పోతే మాకేంటి..? మా పంతం నెగ్గితే చాలు అన్నట్లుంది నేతల తీరు. కార్పొరేషన్ అధికారులు సైతం వివాదానికి ఆజ్యం పోసి చలి కాచుకుంటున్నారు. వారి అసమర్థత, అవినీతి బయటకు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. 2024 డిసెంబర్ 23 తరువాత ఇప్పటి వరకు సర్వసభ్య సమావేశం జరగలేదు. అంతకుముందు నవంబర్‌లో జరిగిన సమావేశం కూడా ఉద్రిక్తపరిస్థితుల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ముగిసింది. రెండు రోజుల క్రితం జరిగిన సమావేశం కూడా నాటకీయ పరిణామాలతో ముగింపు లేకుండా పోయింది.

- పైచేయి సాధించేందుకే మేయర్ సురేష్ - ఎమ్మెల్యే మాధవీరెడ్డి యత్నం
- 2024 నవంబర్ నుంచి సజావుగా సమావేశం లేదు.. చర్చ లేదు..
- పంతమేనా?.. ప్రజా సమస్యలు పట్టవా?
- కడప కార్పొరేషన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట
- కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ ఊసే లేదు
- ఏడేళ్ళవుతున్నా పూర్తికాని అమృత్ స్కీం పనులు
- వివాదానికి ఆజ్యంపోసి పబ్బం గడుపుకుంటున్న అధికారులు

2లో

### హైవే రైతుల పరిహారంపై...

# అధికారుల కసరత్తు

### సాంకేతిక లోపంతో జమకాని పరిహారం



**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** వేంపల్లి-చాగలమర్రి రెండు వరుసల జాతీయ రహదారి భూసేకరణలో రైతులకు పరిహారం అందించడంలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొన్ని సాంకేతిక లోపం కారణంగా రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయడంలో ఆలస్యం జరిగిందని సమాచారం గత మూడు నెలలకుపైబడి జిల్లా జాయింట్ కలెక్టర్ రాజుపాళెం మండలంలో పర్యటించి పెండింగ్ లోఉన్న కొర్రపాడు రైతుల నష్టపరికారాన్ని ఖరారు చేశారు మండలంలోని 8గ్రామాల్లో జాతీయ రహదారి- 440 నిర్మాణం కోసం భూ సేకరణ గెజిట్ పబ్లికేషన్ పూర్తయింది ఈ రెండు వరసల రహదారి కోసం88.03 ఎకరాలు 382 మందిని రైతులను గుర్తించి వారి నుంచి భూ సేకరణచేశారు రైతుల ఖాతాల వివరాలను కూడా తీసుకున్నారు వారం పది రోజులు లోపల రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్మును జమ చేసేందుకు అటు హైవే, రెవెన్యూ అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారు ఈ రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ..మిగతా 2పేజీలో

## కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏపికి తరలించాలి

5లో

# రైతుల చెంతకు చేరని మద్దతు ధరలు..!



### ప్రభుత్వ కేటాయింపుల్లో అన్నదాతకు తప్పని కష్టాలు

**దువ్వూరు, మేజర్‌న్యూస్:** వ్యవసాయ పంటల ఉత్పాదకత పెరగాలంటే ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ప్రోత్సాహ కరంగా ఉండాలి. రైతుకి లాభసాటి ధర వచ్చి నప్పుడే సీదపడతాడు. రైతు అధికంగా ఉత్పత్తి చేయడానికి సిద్ధపడతాడు. అభి వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో సాధారణ ధరలను వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. రైతులకు అండగా నిలిచేందుకు ఏటా కేంద్రం కనీస మద్దతు ధరలు ప్రకటిస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్లో 14 రకాల పంటలకు కనీస మద్దతును ధరలను కేంద్రం ప్రకటించింది. వాస్తవ సాగు ఖర్చులతో పోలిస్తే కంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు అరకొరేనని రైతులు వాపోతున్నారు. దున్నేవాడు లెక్క చూస్తే రైతుకు నాగలి కూడా మిగలదని ఒక సామెత వుంది. తన కన్నీళ్లను పంట కాలువలకు మళ్లించి అయినా పం టలు పండించేది రైతున్న , తన చెమటని చమురుగా మార్చి అయినా దేశ దీపాన్ని వెలిగించేది అన్నదాతే. చీడ పీడలు గాయపరిచినా, తుపానులు వణికిం చినా, ఆకాల వర్షాలు కన్నీటి మడుగులై కలవర ..మిగతా 2పేజీలో

# విద్య తోనే ఉన్నత స్థాయి సాధ్యం

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి




8లో

# కంపు కొడుతున్న కేసీ కాలువ

... వార్త 8 పేజీలో

### అసాంఘిక కార్యకలాపాలపై

# పోలీసుల ఉక్కుపాదం



8లో

సూర్య
www.suryaa.com
KADAPA
కడప జిల్లా
సోమవారం
23 జూన్ 2025

# హైవే రైతుల పరిహారంపై... అధికారుల కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయి చాలా రోజులు కావస్తోంది రోడ్డు నిర్మాణంతో పాటు భూసే కరణకు అవసరమైన నిధులను కేటా యించారు రాజుపాళెం మండలం లోని రైతులకు పరిహారం సుమారుగా 13 కోట్లు అందించాల్సి ఉంది పరిహారం రైతుల ఖాతాలో జమైతే రోడ్డు పనులు మొద లు పెట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది ఇప్పుడున్న రహదారిని రెండువరుసల రహదా రిగా అభివృద్ధి చేస్తారు వేంపల్లి, ప్రొద్దుటూరు,రాజుపాళెం మీదుగా నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రి వద్ద ఉన్న జాతీయ రహ దారి-40కి ఈ రహదారిని అనుసంధానం చేస్తారు. ఈ రెండు వరుసల రహదారి నిర్మాణం కోసం ఆయా గ్రామ ప్రజలు వాహనదారులు ఎదురు చూస్తున్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే ప్రజలకు మరింతసౌకర్యంగా మారనుంది.

## పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల పట్టణంలోని కె.ఆర్ ఆర్ టౌన్షిప్, గోవింద్ రెడ్డి నగర్‌లో షేక్ పర్వీన్ మరియు కీ.శే.అబ్దుల్ రజాక్ ల జేష్ట పుత్రుడు షేక్ సద్దాం, అలాగే పట్టణంలోని బెస్తవీధికి చెందిన షేక్ బషీరున్ మరియు మహబూబ్ బాషా (గోరే) ల కనిష్ట పుత్రిక వివాహానికి ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# నవ్విపోదురు.. మాకేంటి..?

**కడప బ్యూరో - మేజర్‌న్యూస్ :**

కడప నగర పాలక సంస్థ పాలకవర్గం, మేయర్ కె.సురేష్‌బాబు - కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మధ్య వివాదం సీరియల్ ఎపిసోడ్‌లా సాగుతూనే ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరణలో విఫలమైందని 2024 జులైలో వైసీపీ కార్పొరేటర్లు విమర్శలు చేశారు. ఈ అంశంపై కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి తీవ్రంగా స్పందించారు. మేయర్ సురేష్‌బాబు - ఎమ్మెల్యే మధ్య పెద్ద ఎత్తున మాటల యుద్ధం నడిచింది. ఈ నేపథ్యంలోనే ఆగస్టు 27న టీడీపీకి చెం దిన కొందరు మేయర్ ఇంటి ఎదుట చెత్త పోసి నిరసన తెలిపారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో నవంబర్‌లో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయి తే వేదికపై ఎమ్మెల్యేలకు వేసిన కుర్చీలను మేయర్ తొలగించారు. వేదికపై కుర్చీ లేకపోవడంతో ఎమ్మెల్యే మాధవీరెడ్డి నిరసన తెలిపారు. నిల్చునే తన వాదనలు వినిపించారు. ఉద్రిక్తపరిస్థితుల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఆ సమావేశం ముగిసింది. దీంతో కుర్చీలాట మొదలైంది. వేదికపై కూర్చీ ఏర్పాటు చేయాల్సిందే నని ఎమ్మెల్యే గటిగా వాదిస్తుండగా, నిబంధనల ప్రకారం సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులకు కూడా వేదిక కింద కుర్చీ వేస్తామని పాలక వర్గం చెబుతోం ది. దీంతో వివాదం తారాస్థాయికి చేరింది. ఆ తరువాత డిసెంబర్ 23 నాటి సర్వసభ్య సమావేశంలోనూ అంతకు మించిన ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆ తరువాత మేయర్ సురేష్‌పై కాంట్రాక్టు పనుల విషయంలో విజిలెన్స్‌కు ఫిర్యాదు లు.. విచారణలు.. న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వంటివి చోటుచేసుకున్నాయి. ఫలితంగా 2024 డిసెంబర్ 23 తర్వాత ఇప్పటి వరకు సమావేశం నిర్వహించ లేదు. తాజాగా ఈనెల 21న సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. కానీ ఇందు లో హైడ్రామా నడిచింది. అప్పటికే కౌన్సిల్ మీటింగ్ హాలులో మార్పులు చేసి వేదికపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు సీట్లు ఏర్పాటు చేశారు. దీన్ని మేయర్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎవరిని అడిగి ఇలా ఏర్పాటు చేశారని, పాలకవర్గాన్ని ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కాన్ఫరెన్స్ హాలులో సమావేశం ఏర్పాటు చేయాలని మేయర్ సురేష్ పట్టుపట్టారు. కానీ ఎమ్మెల్యే మాధవీ సమావేశానికి ముందే కౌన్సిల్ మీటింగ్ హాలుకు చేరుకుని కొత్తగా ఏర్పాటు చేసిన తన సీటులో కూర్చున్నారు. అధికారులు కూడా మీటింగ్ హాలులోనే సమావేశాన్ని నిర్వహించేం దుకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ మేయర్, మెజారిటీ కార్పొరేటర్లు అంగీ కరించక రెండవ ఫ్లోర్‌లోని కాన్ఫరెన్స్ హాలు బయట సమావేశాన్ని ఏర్పాటు చేసు కుని తీర్మానాలు ఆమోదించారు. ఇలా ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకే ప్రయత్నిస్తున్నారు తప్ప నగర ప్రజల సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. 2024 నవంబర్ నుంచి సజావుగా సమావేశం లేదు.. చర్చ జరగలేదు.

**సమస్యలు తిష్ట.. అయినా పట్టింపు లేదు..**

కడప నగర ప్రజలు మంచినీటి ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. ఎప్పుడో ఏడేళ్ళ క్రితం అమృత్ ఫేజ్-1 పనులు ఇంకాపూర్తి కాలేదు. 64 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఇప్పటికి ఆరుసార్లు గడువు పొడిగించారు. కానీ ఫలితం కనిపించడం లేదు. దీనిపై కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. వరద కాలువల నిర్మాణ పనుల్లో పురోగతి లేదు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, రహదారుల విస్తరణ ఆశించిన మేర ముందుకు సాగడం లేదు. పను లు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలన్న యావ అధికారుల్లో కనిపించడం లేదు. పనుల పురోగతిని ఏమాత్రం పట్టించు కోవడం లేదు. చిన్నపాటి వర్షానికే నగరం కంపుకొడుతోంది. కొన్ని ప్రాంతాల్లో మురికి దిబ్బలు మూడు, నాలుగురోజులకు క్లీన్ చేస్తున్నారు. దీంతో ప్రధాన వీధు లు సైతం డ్రైనేజీ కాల్వల్లా మారిపోతున్నాయి. తాగునీటికి సంబంధించి మోటా ర్లు, పైపుల్లో చిన్న సమస్య తలెత్తినా నగరానికి మూడు రోజులు నీటిసరఫరా ఉం డటం లేదు. నగరపాలక సంస్థలోని కీలక విభాగాల్లో అక్రమాలు పెరిగాయి. కార్పొరేషన్‌లో పాలకవర్గానికి - ఎమ్మెల్యేకు మధ్య జరుగుతున్న వివాదాన్ని కొంత మంది అధికారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తమ తప్పులు బయ టకు రాకుండా వివాదానికి ఆజ్యం పోస్తున్నారు. తాగునీటి పథకానికి సంబం ధించి ఇటీవల పిలిచిన టెండర్లలో కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగులే బినామీ పేరుతో కాంట్రాక్టు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం పనుల ఆమోదం తదితర అంశాలపై చర్చించాల్సి ఉంది. గత మూడు సమావేశాల నుంచి ఇది ముందుకు సాగలేదు. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచిపోతోంది.

అయినా ఇంత వరకు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ ఊసే లేదు. ప్రజలపై పన్నుల భారం పెరిగింది. వీటన్నింటిపై చర్చ జరగాలి. కానీ సమావేశాలే నిర్వహించకపోతే చర్చలు ఎలా జరుగుతాయని ప్రజలు వాపోతున్నారు. నగర పాలక సంస్థ పాలక వర్గం, ఎమ్మెల్యే మధ్య సఖ్యత ఉండాలి. సమన్వయంతో వ్యవహరిస్తేనే కడప నగరాభివృద్ధి సాధ్యమవుతుంది. అలా కాకుండా ఏడాది కాలంగా ఇరువురి మధ్య వివాదం తారా స్థాయిలో నడు స్తోంది. ఒకరిపై ఒకరు పైచేయి సాధించాలనే పట్టుదలే తప్ప నగరాభివృద్ధికోసం కలసి పని చేయాలని ఇరువురు ఆలోచించడం లేదు. దీని ప్రభావం నగరంపై స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కూడా ఏ ఒక్కరికో వంతపాడకుండా నిబంధ నల ప్రకారం వ్యవహరించాల్సి ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మేయర్‌కు, కార్పొరేటర్లకు విలువనివ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదు. పాలకవర్గం కాన్ఫరెన్స్ హాలులో సమావేశం అవుతుంటే తాళం వేయడం ఏమి టి?.. మీటింగ్ హాలులో మార్పులు చేసి ఎమ్మెల్యేలకు సీట్లు ఏర్పాటు చేయవ చ్చు.. కానీ పాలకవర్గానికి కనీస సమాచారమైనా ఇవ్వాల్సి ఉంది. అలాకాకుండా విచక్షణా ధికారం పేరుతో ఇష్టానుసారం వ్యవహరిస్తే విమర్శలు తప్పవు. ఇప్ప టికైనా నేతలు పంతం వీడి నగరాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రైతు చెంతకు చేరని మద్దతు ధరలు..!

(మొదటి పేజీ తరువాయి)

పరిచినా, దళారులు, మిడతల దండై దాడి చేసినా దేశానికి ఇంత ముద్ద పెట్టేది అన్నదాతే. అటువంటి అన్నదాతకు ఈ దుర్భర దుస్థితి, ఆసంబద్ధ, అశా స్త్రీయ పద్ధతిలో కనీస మద్దతు ధరల నిర్ధారణ బాగోతాలు నిర్ఘాంత పరుస్తు న్నాయి. విత్తు నాటడం నుంచి వచ్చిన దిగుబడిని మార్కెటు తీసుకెళ్లడం వరకు రైతుకయ్యే ఖర్చులకూ, పంట అమ్మిన తరవాత వచ్చే సొమ్ములకూ ఎక్కడా పొం తనే ఉండటం లేదు. అప్పులే తప్ప ఆదాయాల్లేని అన్నదా తల బతుకుల్లో చీక ట్లు అలుముకొంటున్నాయి. ప్రతి సంవత్సరం పంటలకు మద్దతు ధరలు పెరు గుతున్నప్పటికీ అంతకంటే అధికంగా సాగు ఖర్చులు అయిన కూలీ రేట్లు, విత్త నాలు, ఎరువులు, పురుగుమందుల కోసం పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి. కేంద్రకేబినెట్ ఖరీఫ్ పంటల కనీస మద్దతు వరి క్వింటా ధర రూ.69 పెంచింది. ఈ పెంపుతో క్వింటా వరి మద్దతు ధర రూ.2389కి చేరిం ది. జొన్నలు క్వింటా 328, సజ్జలు 150,రాగులు రూ.598, వేరుశనగ రూ.180, మొక్కజొన్న రూ.175, కందులు రూ.450, పెసలు రూ.80. మిను ములు రూ.400, పొద్దు తిరుగుడు రూ.441, సోయా బీన్ రూ.436, కుసు ములు రూ.579, ఒలిసిలు రూ.820, పత్తి క్వింటా రూ.589 కనీస మద్దతు ధరలతో అరకొర పెంచి కేంద్రప్రభుత్వం చేతులు దులుపుకొంది. కేంద్ర క్యాబినెట్ ప్రకటించిన మద్దతు ధరలకు, పంట సాగుకయ్యే ఖర్చులకూ ఎక్కడా పొంతన లేదు. ధరల అనిశ్చితి నుంచి రైతులను రక్షించేందుకు 1966-67లో భారత ప్రభుత్వం కోస మద్దతు ధరను (ఎంఎస్పీని) ప్రవేశపెట్టింది. తృణధాన్యాల ఉత్పత్తిలో భారీ బోటు నెలకొన్న తరవాత వెలువడిన నిర్ణయమిది. జనాభాకు కావాల్సిన ఆహార ధాన్యాల గిరాకీని దృష్టిలో పెట్టుకొని పంటలు పం డించడానికి అనువుగా ఉండేలా ధరల విధానాన్ని రూపొందిం చింది. ఈ కనీస మద్దతు ధరలను నిర్ణయించే సంద ర్భంలో ఉత్పత్తి వ్యయాలు, ముడి పదార్థాల ధరల్లో మార్పులు, వివిధ ఆహార పంటల ధరల వ్యత్యాసం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. కానీ ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేసి మద్దతు ధరలు ప్రకటించినట్లు లేదు. అట్లాగే పంటలకు మద్దతు ధరలు ప్రకటించేదే సాగుదారుల్లో భరోసా నింపేం దుకు, భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్న నమ్మ కం. కలిగించడానికి, కానీ వాస్తవంలో హేతుబద్ధ మద్దతు లేక రైతు బతుకు



గాలిలో దీపంలా మారింది. క్రిసిల్ నివేదిక కనీస మద్దతు ధరను అధిక పంట లకు అధిక పరిమాణంలో వర్తింప జేస్తే రైతుల రాబడి పెరుగు తుందని చెప్పిం ది. ధరల నిర్ణాయక వ్యవస్థను బలో పేతం చేసేందుకంటూ 28 మంది సభ్యు లతో ప్రత్యేక కమిటీ కొలువు తీరి రెండేళ్లు దాటినా కనీస మద్దతు తీరు తెన్నులు మాత్రం మారలేదు. కేంద్రం ప్రకటి స్తున్న కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత లేదు. పంట లకు కనీస మద్దతు ధరలకు (ఎంఎస్ పి) చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్ పై ఏర్పాటు చేసిన పార్లమెం టరీ స్టాండింగ్ కమిటీ కూడా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు ఎంతో కాలం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. చట్టబద్ధత కల్పించా లన్న రైతుల చిరకాల డిమాండును పట్టించుకో వడం లేదు. గిట్టుబాటు కాని నష్టజాతక సేద్యాన్ని దేశ వ్యాప్తంగా 45 శాతం రైతులు కాడి, మేడీ వదిలి పెట్టి వేరే బతుకుతెరువు వెతుక్కుంటూ వలసబాట పడు తున్నారు. కేంద్రం ప్రకటించే మద్దతు ధరల వల్ల తమకి ఒరుగుతున్నది ఏమీ లేదని రైతులు వాపోతు న్నారు. కేంద్రం మద్దతుతో పోలిస్తే బయట మార్కెట్ లోనే అధిక ధర లభిస్తుండటంతో కొంతకాలంగా రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయిస్తు న్నారు. కేంద్రం ప్రకటించిన ఆ మద్దతు ధర అయినా ఇవ్వకుండా రైతులను మార్కెట్ మాయలోళ్లు దోచుకు తింటున్నారు. అప్పో సప్పో చేసి పాలంలో గుమ్మరించిన పెట్టుబడులనైనా తిరిగి రాబట్టుకోలేని దురవస్థ కొనసాగుతున్నది. నష్టాల సాగును ఎవరు కొనసాగిస్తారు? రైతులు విరక్తితో పంటపొలాలకు దూరమైతే దేశ ఆహార భద్రతకే పెను ముప్పు దాపురిస్తుంది. పంట పండించేవారిని సంరక్షించు కోవడమే కేంద్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యాంశం కావాలి. వ్యవసాయం గౌరవప్రద వృత్తిగా కొనసా గేలా, నవతరాన్ని సేద్యం వైపు ఆకర్షించేలా సాగుడా రుల సమస్యల్ని ప్రభుత్వాలు శాశ్వతంగా పరిష్క రిస్తేనే రైతుకు ఆత్మనిర్భరత, దేశానికి ఆహారభద్రత ఏర్పడుతుంది. గిట్టు బాటు ఎండ మావై, పెట్టు బడులు కూడా రాక బతుకులు బండ బారుతున్న సాగుదారుల వ్యదార్ధ జీవన చిత్రం ఒక పక్కన కళ్ళకు కడు తుంది. మద్దతు ధరలు నిర్ణయించ డంలో శాస్త్రీయత అవసరమన్న స్వామినాథన్ సిఫార్సులు చెదలు పట్టాయి. ఆరుగాలం కష్టపడి పండిం చిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిం చడం కన్నా గొప్ప బరోసా రైతుకీ అవసరం లేదని, పంటలకు గిట్టు బాటు ధర కల్పించి తమ బతుకులను బాగుచేయాలంటూ వారు ఏళ్లుగా పాలకులను వేడుకొంటున్నారు. కావునా పంట పండించే వారు లేకపోతే పాలించేవారికి ముద్ద దొరకదు. రైతును బతికించండి. పంట పొలాలను నమ్ముకొన్న పాపానికి అప్పులు పాలై అన్నదాతలు ప్రాణాలు తీసుకొంటున్నారు. ప్రభుత్వాలు ప్రకటి స్తున్న పెరుగొప్ప పథకాలు ఏవి రైతులను ఆదుకో వడం లేదు. గిట్టు బాటు ధరలే సాగు సక్షోభాన్ని పరిష్కరించగలవు. 30 సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా నాలుగు లక్షల మంది రైతులు, వ్యవ సాయకార్మికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ కమిటీ తేల్చింది. కావునా కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణం రైతుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలి. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి, బాధ్యత ఉంటే విత్తు నాటే నాటినుంచి విపణి వరకు ప్రతిచోటా అన్నదాతలకు అండగా నిలవాలి. సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసిన, రైతాంగం ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రుణ మాఫీ వంటి చర్యలకు తక్షణం శ్రీకారం చుట్టాలి. ఏది ఏమైనా అసంబద్ధ ఆశాస్త్రీయ పద్ధతిలో కనీస మద్దతు ధరల నిర్ధారణ బాగోతాలు నిర్ఘాంత పరుస్తున్నాయి. కనీస మద్దతు ధరలపై కనికరం చూపి కేంద్ర ప్రభుత్వం రైతులను అదుకోవాల్సిన అవసరం చాలా వుంది.

# ప్రమాదకరం డెంగ్యూ జ్వరం

## ఆదమరిస్తే అంతే సంగతులు - వర్షాకాలంలో ప్రబలే అవకాశం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** డెంగ్యూ ప్రమాదకర జ్వరం. ఈ వ్యాధి యొక్క లక్షణాలు, నివారణ చర్యలు మరియు చికిత్స గురించి ప్రజలకు అవగాహన తప్పనిసరి.

**డెంగ్యూ అంటే ఏమిటి**

డెంగ్యూ అనేది దోమల వల్ల వచ్చే వైరల్ వ్యాధి. ఇది తలనొప్పితో కూడిన అధిక జ్వరం, తీవ్రమైన కండరాలు మరియు కీళ్ల నొప్పులు వంటి ఫ్లూ లాంటి అనారోగ్యాలకు దారితీస్తుంది. ఇటీవలి దశాబ్దాలలో, డెంగ్యూ సంభవం పెరిగింది. ప్రధానంగా, ఇది ప్రపంచంలోని ఉష్ణమండల మరియు ఉపఉష్ణమండల ప్రాంతాలలో సంభవిస్తుంది. డెంగ్యూ జ్వరం, దాని లక్షణాలు, నివారణ మరియు చికిత్స గురించి మనం చదువుదాం. డెంగ్యూ తేలికపాటిగా ఉంటే అది అధిక జ్వరం, దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులకు కారణమవుతుంది, కానీ అది తీవ్రంగా ఉంటే అది తీవ్రమైన రక్తస్రావం, రక్తపోటు అకస్మాత్తుగా పడిపోవడం మరియు మరణానికి కారణమవుతుంది. తీవ్రమైన డెంగ్యూ జ్వరాన్ని డెంగ్యూ హెమరేజిక్ జ్వరం అంటారు. డైరెక్టరేట్ ఆఫ్ ది నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ ప్రకారం, భారతదేశం అక్టోబర్ 13, 2019 వరకు 67,000 కంటే ఎక్కువ డెంగ్యూ జ్వరాలను నివేదించింది. భారతదేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో, డెంగ్యూ స్థానికంగా ఉంటుంది. వరదలు, వర్షాకాలం కారణంగా, కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు డెంగ్యూ కేసుల భయాన్ని పెంచుతున్నట్లు కనిపిస్తోంది. నిలిచి ఉన్న నీటి పరిస్థితి దోమలు లేదా వెక్టర్స్ వృద్ధి చెందడానికి అనుమతిస్తుంది.

**లక్షణాలు :**

డెంగ్యూ జ్వరం యొక్క తేలికపాటి సందర్భంలో, పిల్లలు లేదా టీనేజర్లలో ఎటువంటి సంకేతాలు లేదా లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. లక్షణాలు కనిపిస్తే, అవి సోకిన దోమ కుట్టిన తర్వాత నాలుగు నుండి ఏడు రోజుల వరకు ఉంటాయి. తలనొప్పి, కీళ్ల లేదా కండరాల నొప్పి, వికారం, వాంతులు, ఉబ్బిన గ్రంథులు, కళ్ళ వెనుక నొప్పి, దద్దురులు, తీవ్రమైన కడుపు నొప్పి, మూత్రంలో, మలంలో లేదా వాంతుల్లో రక్తం, అలసట వంటి లక్షణాలు ఉంటాయి.

**డెంగ్యూ జ్వరం ఎలా వస్తుంది?**

దోమల ద్వారా వ్యాపించే నాలుగు రకాల డెంగ్యూ వైరస్‌ల వల్ల డెంగ్యూ జ్వరం వస్తుంది. అన్ని వైరస్‌లు ఏడిస్ ఈజిప్టి లేదా ఏడిస్ ఆల్బోపిక్టస్ దోమ అని పిలువబడే దోమల జాతుల ద్వారా వ్యాపిస్తాయి. డెంగ్యూ వైరస్ నాలుగు విభిన్న సెరోటైప్‌లను (డిఈఎన్-1, డిఈఎన్-2, డిఈఎన్-3 మరియు డిఈఎన్-4) కలిగి ఉంటుందని మీకు తెలియజేద్దాం. అవి ఫ్లావివైరస్ జాతికి చెందినవి, ఫ్లావివిరిడే కుటుంబం. ఏడిస్ ఈజిప్టి దోమ ఆఫ్రికాలో ఉద్భవించింది కానీ ప్రపంచవ్యాప్తంగా ఉష్ణమండల ప్రాంతాలలో కూడా కనిపిస్తుంది. ఒక దోమ డెంగ్యూ వైరస్ బారిన పడి ఒక వ్యక్తిని కుట్టినప్పుడు, వైరస్ దోమలోకి ప్రవేశిస్తుంది. ఈ సోకిన దోమ మరొక వ్యక్తిని కుట్టినప్పుడు, వైరస్ ఆ వ్యక్తి రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తుంది.

**డెంగ్యూ ఎలా నివారించబడుతుంది?**




ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, డెంగ్యూ జ్వరాన్ని తగ్గించడానికి వ్యాక్సిన్ మాత్రమే ప్రభావవంతమైన సాధనం కాదు. దోమల జనాభాను మరియు మానవ బహిర్గతంను నియంత్రించడం అవసరం, ఇది నివారణ ప్రయత్నాలలో అత్యంత కీలకమైన భాగం. సరైన దుస్తులు ధరించడం వల్ల చర్మం మొత్తం మీద పడకుండా ఉండవచ్చు. సాక్స్, పొడవాటి చేతుల చొక్కాలు ధరించడం వంటివి. దోమ కాటును నివారించడం కూడా చాలా ముఖ్యం. దోమల నివారణ మందులను వాడాలి. దోమల ఉచ్చులు మరియు వలలు వాడాలి. కిటికీలు మరియు తలుపులలో వలలు లేదా తెరలు ఉండాలి. సువాసనగల సబ్బులు మరియు పరిమళ ద్రవ్యాలు దోమలను ఆకర్షించవచ్చు. నిలిచి ఉన్న నీటిని సకాలంలో తొలగించడం తప్పనిసరి. ఏడిస్ దోమ శుభ్రమైన మరియు నిలిచి ఉన్న నీటిలో సంతానోత్పత్తి చేస్తుంది.

**డెంగ్యూ జ్వరానికి చికిత్స ఏమిటి?**

డెంగ్యూ ఒక వైరస్ అని మనకు తెలుసు, కాబట్టి నిర్దిష్ట చికిత్స లేదా చికిత్స లేదు. కానీ వ్యాధి ఎంత తీవ్రంగా ఉందో బట్టి జోక్యం సహాయపడుతుంది. డెంగ్యూ జ్వరం స్వల్పంగా ఉంటే, కొన్ని చికిత్సలు సహాయపడవచ్చు, అవి డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి అధిక జ్వరం మరియు వాంతులు వస్తాయి, ఇది నిర్జలీకరణానికి దారితీస్తుంది. కాబట్టి, ఒక వ్యక్తి కుళాయి నీటి కంటే శుభ్రమైన నీటిని తాగాలి. రీహైడ్రేషన్ లవణాలు కూడా తీసుకోవచ్చు. టైలెనాల్ లేదా పారాసెటమాల్ వంటి నొప్పి నివారణ మందులు జ్వరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఆస్పిన్ వంటి నాన్-స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ తీసుకోవడం మంచిది కాదు ఎందుకంటే అవి అంతర్గత రక్తస్రావం ప్రమాదానికి దారితీయవచ్చు.

**డెంగ్యూ జ్వరం తీవ్రంగా ఉంటే:**

ఇంట్రావీనస్ ఫ్లూయిడ్ సప్లిమెంటేషన్ సహాయపడుతుంది. తీవ్రమైన నిర్జలీకరణంతో బాధపడుతున్న రోగులకు, రక్త మార్పిడి పరిష్కారం కావచ్చు. లక్షణాలు తీవ్రమైతే ఆసుపత్రిలో చేరడం అవసరం.

## ఎమ్మెల్సీ రమేష్ యాదవును కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి



**పులివెందుల,మేజర్‌న్యూస్:** ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను వైకాపా చేనేత విభాగ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ పులివెందుల స్థితిగతులను ఈశ్వరయ్యను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు.

## స్వచ్ఛ జిల్లాగా వైఎస్‌ఆర్ కడప

**కడప ప్రతినిధి - మేజర్ న్యూస్:** స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో.. భాగంగా వైఎస్‌ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛ దివస్ ఈ కార్యక్రమంలో భాగంగా.. తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి లతో క్రికెట్ స్టేడియంలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. ప్రతినెల మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ... మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా, మన జిల్లాను స్వచ్ఛమైన కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు.

## భక్తిశ్రద్ధలతో భాగవత సప్త హోమం



పులివెందుల, మేజర్‌న్యూస్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధి లోని బ్రాహ్మణపల్లి శ్రీ సీతారామాలయంలో ఆదివారం భాగవత సప్త హోమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలచే కలశములను గ్రామ పుర వీధుల్లో భక్తి శ్రద్ధల మధ్య ఓం నమో భగవతే వాసుదేవాయ నామస్మరణ మధ్య గ్రామోత్సవం నిర్వహించి అనంతరం భాగవత పండితులకు మద్దూరి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు సన్మానం నిర్వహించారు అనంతరం వరా సుధాకర్ రెడ్డి కుటుంబీకులు భాగవత గీత పుస్తకాలను భాగవత పండితులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవర కోన హరిహర క్షేత్ర అధ్యక్షులు వెన్నపూస నారాయణరెడ్డి, సరిబాల వెంకట నారయణ రెడ్డి, మూలీ జయారామి రెడ్డి, దత్త రాజా మునీంద్ర స్వామి, మీడియా ఇన్చార్జిలు నాగేశ్వరరెడ్డి, భాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిరోధానికి సమష్టిగా కృషి

## ఈగల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో జరిగిన యోగాంధ్ర మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో.. ఈగల్ (ఎలైట్ యాంటి-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లు ముఖ్య అతిథులతో కలిసి ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో.. రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ కడప స్టేడియం చైర్మన్ శ్రావణ్ రాజ్ రెడ్డి, జేసీ అధితి సింగ్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.. పోస్టర్లను ప్రదర్శిస్తూ "మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను." అని యోగాకు హాజరైనవారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ రెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డా. ఎస్. మురళి బాబు, జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, మెప్మా పి.డి కిరణ్ కుమార్, 'ఈగల్' సిబ్బంది, పలువురు జిల్లా అధికారులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక స్పృహగల రచయిత సత్తార్ ఫైజీ

## ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

**కడప టౌన్, మేజర్‌న్యూస్:** సత్తార్ ఫైజీ నేటి సమాజానికి అనుగుణంగా సామాజిక స్పృహ గల అంశాలనే తీసుకొని రచనలు చేస్తున్నారని, ప్రస్తుతం ఉర్దూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న 36 మంది కవుల జీవిత విశేషాలను సంక్షిప్తంగా పరిచయం చేస్తూ 'ఉర్దూ హృదయం లో తెలుగు స్వరం' అనే విశిష్ట గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయమని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం రాయలసీమ ఉర్దూ రచయితల సమైక్య ఆధ్వర్యంలో నగరంలోని ప్రైవేటు కాన్ఫరెన్స్ హాల్లో సత్తార్ ఫైజీ రచించిన ఉర్దూ హృదయం లో తెలుగు స్వరం అనే పుస్తకావిష్కరణ జరిగింది. అనంతరం మూల మాట్లాడుతూ కవిగా, రచయితగా, అనువాదకుని గా పరిశోధకునిగా, నటునిగా బహుముఖ ప్రజ్ఞను కనపరుస్తున్న సత్తార్ ఫైజి ఈ గ్రంథంలో ఉర్దూ భాష ఔన్నత్యానికి కృషి చేస్తున్న విశ్వవిద్యాలయ ఆచార్యులు, కవులు, కళాకారులు, రచయితలు,విద్యావేత్తలు, భాషావేత్తలు, పరిశోధకుల జీవిత విశేషాలను, రచనలను పరిశోధనా దృక్పథంతో రాశారన్నారు. అధ్యక్షులుగా వ్యవహరించిన ఆచార్య ఖాసిం అలీ ఖాన్ మాట్లాడుతూ సత్తార్ ఫైజీ గతంలో పిల్లల ప్రపంచం,ఉర్దూ సాహిత్య నవరత్నాలు, భక్తి – ముక్తి అనే గ్రంథాలు రాశారని జిల్లాలో కవిగా రచయితగా ఒక సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారువిశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ సలీం భాష మాట్లాడుతూ సత్తార్ ఫైజీ ఉర్దూ భాషకు చేస్తున్న సేవ గురించి కవిత రూపంలో గానం చేశారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన అమీర్ బాబు మాట్లాడుతూ సత్తార్ ఫైజీ గత 30 సంవత్సరాలుగా ఎన్నో ఉర్దూ కవి సమ్మేళనాలు, సాంస్కృతిక,



సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. గౌరవ అతిథులు రఘునాథరెడ్డి, నాసర్ భాష, రజాక్ సాబ్, ఇప్తే ఖార్ జమాల్, ఉర్దూ కవులు సయీద్ ఖాన్, మహమూద్ షాహిద్, అన్వర్ హాది, సర్దార్ సాహిర్, మహబూబ్ ఖాన్, ఉపాధ్యాయులు డాక్టర్ వసీవుల్లా భుక్తి యారి, డాక్టర్ ఖాజా పీర్, గునిశెట్టి శ్రీనివాసులు, అబ్దుల్ ఖాదర్ ఖాన్ లాజక్, అహమ్మద్, అతావుల్లా అక్తర్, గౌస్ ఖాన్, ఆరిఫ్‌లు సత్తార్ ఫైజీ ప్రతిభా విశేషాలను కొనియాడారు. సన్మానం అనంతరం సత్తార్ ఫైజీ స్పందిస్తూ ఉర్దూ కవుల, రచయితల, పరిశోధకుల, విమర్శకుల, ఉత్తమ ఉపాధ్యాయుల సేవల గురించి ఉర్దూ హృదయములో తెలుగు స్వరం గ్రంథాన్ని తెలుగు వారికి పరిచయం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు

# ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

## ఎం.ఆర్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** గత కొద్ది రోజుల నుంచి దినపత్రికలలో, సోషల్ మీడియాలో కడప జిల్లా మైనారిటీ శాఖకు సంబంధించిన నిధులు దాదాపు రూ. 6 కోట్లు కార్యాలయంలో స్కాము జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి తెలిపారు. ఆదివారం స్థానిక ఎంఆర్ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ సంఘటన పై విచారణ చేస్తున్నారని తెలిసిందన్నారు. నిరుపేదల మైనారిటీలకు దక్కవలసిన ప్రజాధనాన్ని ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టిన వారిపై, కార్యాలయంలో సహకరించిన వారిపై సమగ్ర విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజాధనాన్ని వెనక్కి తీసుకొని ఖజానాలో జమ చేయాలని, అధికారి తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి మంత్రి మంత్రి దగ్గరకు వెళ్లారని చెప్పారు. అలాగే కడప ఎమ్మెల్యే దగ్గర కూడా వెళ్లారని వివిధ దినపత్రికల్లో వస్తుందన్నారు. తప్పులను సరిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని, స్కామ్ నుంచి బయటపడేయాలని పై అధికారి తో కొందరు సంప్రదింపులు చేస్తున్నారని సమాచారం ఉందన్నారు. ఈ స్కాం బయట పడాలంటే సిఐడి, సి.బి.సి.ఐ.డి కి అప్పచెప్తే దోషులను త్వరగా పట్టుకుంటారని ఆయన చెప్పారు.

# టిడిపి సంస్థాగత పదవుల కమిటీ నియామకాలపై నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ పార్టీ సంస్థాగత పదవుల కమిటీలను త్వరలో పూర్తి చేయవలసినదిగా టిడిపి రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి సమావేశన్ని నిర్వహించి పార్టీకోసం పనిచేసిన ప్రతిఒక్కరికి పదవులు దక్కుతాయని, గ్రామ, వార్డుల నందు స్థానికంగా పార్టీకోసం పనిచేసిన వారిని గుర్తించి పేర్లను పంపాలని త్వరలోనే పట్టణ మండల నియోజకవర్గ కమిటీలను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. పార్టీ పదవుల నియామక ప్రక్రియకు టిడిపి రాష్ట్ర కార్యాలయం నుండి పరిశీలకులుగా నియమించిన ప్రొద్దుటూరు పరిశీలకుడు ఏవిఆర్ ప్రసాద్, అద్దేపల్లి పుష్పరాజు, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజి మున్సిపల్ చైర్మన్లు ఆసం రఘురామిరెడ్డి, వియస్ ముక్తియార్, టిడిపి




పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకార్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు, నియోజవర్గంలోని గ్రామ, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుండె పోటుతో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలం సింగరాయపల్లె గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఓసూరి సునీల్ (40) సంవత్సరాలు గుండె పోటుతో మృతి చెందాడు. గుండె నొప్పివచ్చి కుప్పకూలిన వెంటనే 108 కి ఫోన్ చేయగా లేటు గా రావడం వలన 108 వచ్చేసరికి మృతి చెందడం జరిగింది. మృతుడు గత 15 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.. ఆ గ్రామంలో ఇటీవల వరస 4 మరణాలు జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు..

# నేడు యువతపోరు విజయవంతం చేయాలి

## యువజన విభాగం కార్యనిర్వహాక సభ్యులు చల్లా సునీల్ కుమార్

**వేముల మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేం ్కు నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ.. నేడు. ఉదయం కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే 'యువత పోరు'నిరసన కార్యక్రమానికి విద్యార్థులు నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి కడప జిల్లా యువజన విభాగ కమిటీ కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్ పేర్కొన్నారు. వేముల మండలంలోని స్థానిక పార్టీ కార్యాలయం లో వైఎస్ఆర్సిపి కడప జిల్లా యువ జన విభాగ కమిటీ కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్ మాట్లా డుతూ తమ నాయకులు వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపుతో, జిల్లా పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి,యువజన విభాగ అధ్యక్షులు ఆదిత్య ఆధ్వర్యంలో జరగబోయే 'యు వత పోరు'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే యువత పోరులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని,విద్యార్థులను నిరుద్యోగుల ను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం ను ఎండ కట్టలని తెలిపారు.మా పార్టీ మా నాయకులు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూట మి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు మోసానికి గురవుతున్నా రన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు. నెరవేర్చ లేదన్నారుఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎన్నికల హామీ లో బాగంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం అని మోసం చేశారు అని, ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగి స్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేం దుకు ఈనెల 23వ తేదీన కడప కలెక్టరేట్ ఎదుట యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు ప్రజలు,యువజన విభాగం సభ్యులు పెద్దఎత్తున పాల్గొని విజ యవంతం చేయాలన్నారు.



# బదిలీపై వెళ్లిన రికార్డు అసిస్టెంట్‌కు సన్మానం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ కడప జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాల యానికి బదిలీపై వెళ్లిన ఇబ్రాం సాహెబ్‌కి ఆదివారం స్థానిక రామేశ్వరం గ్రంథా లయంలో జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చదువుల బాబు, గ్రంథాలయ అధికారి తిరుప తమ్మ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇబ్రాం సాహెబ్ చేసిన సేవలను గుర్తు చేసి కొనియాడారు. ఆయన జిల్లా సంస్థలో కూడా మెరుగైన సేవ లు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జగన్ మోహన్, గ్రంథాలయ సిబ్బంది నాగలక్ష్మి, రవిబాబు శ్రీనివాసుల రెడ్డి, ఉదయ్ కిరణ్, పాఠకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రోత్సహక బహుమతులు

**కలసపాడు, మేజర్‌న్యూస్:** కలసపాడు మండలం దూలంవారి పల్లె గ్రామానికి చెందిన కొండెపోగు కుటుంబానికి చెందిన విద్యార్థులకు పద వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమస్థానం రావడంతో విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సహక నగదు బహుమతితో పాటు మెమోంటో అందిం చారు. వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ పిల్లలు కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తా మని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.



# గోవింద నామస్మరణతో కాలినడకన తిరుమలకు పాదయాత్ర

## ఎర్రగుంట్ల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి పాదయాత్ర ప్రారంభం





**ఎర్రగుంట్ల మేజర్ న్యూస్:** ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో సుందరయ్య కాలనీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి శ్రీవారి భక్తులు గోవింద నామస్మలతో కాలినడకన తిరుమలకు బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజ కార్యక్రమాలు నిర్వహించుకుని అక్కడి నుంచి తిరుమలకు కాలినడకన పాదయాత్ర ప్రారంభించారు. ఎర్రగుంట్ల నుండి కమలాపురం, కడప, రాజంపేట రైల్వే కోడూరు మీదుగా తిరుపతి అలిపిరి మెట్ల వద్దకు చేరుకుంటారు. 22వ తేదీ నుంచి 30 వరకు తిరుమల కు పాదయాత్ర ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు . 30వ తేదీ అలిపిరి మెట్ల మార్గాన తిరుమల చేరుకొని అక్కడ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయక కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొనుచున్నారు ఎర్రగుంట్ల పట్టణంలో ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులు తిరుమలకు పాదయాత్ర చేపట్టడం ఎంతో శుభసూచకమని ఆలయ ధర్మకర్త జట్టింగ్ రామాంజనేయులు తెలియజేశారు. భక్తులతో కలసి ఆయన కూడా తిరుమలకు కాలినడకన పాదయాత్రలో పాల్గొన్నారు. తిరుమలకు కాలినడకన పాదయాత్ర కు భక్తులలో దాతలు సహకారం ఉంది.

# నేతాజీ సిద్ధాంతాలే దేశానికి ప్రత్యామ్నాయం

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ వీ సుందర రామరాజు



కడప ఎడ్యుకేషన్ (మేజర్ న్యూస్) జూన్ 22: నేతాజీ సిద్ధాంతాలే దేశానికి ప్రత్యామ్నాయ మని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామ రాజు అన్నారు.సుభాష్ చంద్రబోస్ 1939 జూన్ 22న స్థాపించిన అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ ఏఐఎఫ్ బీ పార్టీ 86 వ్యవ స్థాపక దినోత్సవ సందర్భంగా కడప ఐటిఐ సర్కిల్ లో పతాకా విష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీనికి రాష్ట్ర కార్యదర్శి జాల జయ వర్ధన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పి,వి, సుందర రామరాజు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1939 సంవత్సరం జూన్ 22వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ కులమతా లకు అతీతమైన, అంతరాలు లేని సమసమాజ స్థాపన కోసం, బావ భౌతిక వాదాలకు అతీత మైన, ప్రకృతి వాద విధానంతో మనిషి జీవనం సాగాలని, దేశభక్తితో కూడిన దేశాన్ని మార్చాలి! దేశాన్ని రక్షించాలి! ప్రకృతి వనరులను ప్రజలకు పంపిణీ చేయాలని ఆనాడు చెప్పారన్నారు.అదే విధంగా విద్య వైద్యం ప్రభుత్వ రంగంలోనే జరగాలని, వ్యవసా యరంగం పారిశ్రామికీకరణ సమ తూకంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధిని సాధిస్తుందని, భారతదేశంలో సోషలిస్ట్ స్థాపన తప్పనిసరిగా జరగవలసి ఉంటుందని ఉద్దేశంతో లక్నో నగరంలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించడం జరిగిందని తెలిపారు. అప్పటినుండి ప్రజా సమస్యల పట్ల నిరంతరం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోరాడుతూనే ఉందని అన్నారు. పతాకావిష్కరణ అనంతరం కేకు కట్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్, జిల్లా నాయుకులు అఖిల్ పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఏపికి తరలించాలి

## తెలంగాణ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి

## ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డా ఎన్. తులసి రెడ్డి



**వేంపల్లె మేజర్ న్యూస్:** కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ కి తరలించాలని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి ప్రభుత్వాన్ని సూచించారు. ఆదివారం ఆయన వేంపల్లె విలేకరులతో మాట్లాడుతూ జూన్ 27న కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం జరగబోతుందని, ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు అంశాల మీద దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని హైదారాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ కు తరలించి, విభజన చట్టంలో సెక్షన్ 85, సబ్ సెక్షన్ 1 ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన 60 రోజుల లోపల కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాలన్నారు. 11 సంవత్సరాలైనా తెలంగాణ రాష్ట్రంలోని హైద్రాబాద్ లో ఉండడం శోచనీయమన్నారు. ఈ కార్యాలయాన్ని ఏపిలోని శ్రీశైలంలో లేదా కర్నూలులో ఏర్పాటు చేసే విధంగా ఒత్తిడి చేయాలన్నారు. బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు లేకుండా, కేంద్ర జలసంఘం, కృష్ణానదీ యాజమాన్య బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఎగువ నా ఉన్న తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా శ్రీశైలం రిజర్వాయర్ నుండి 90 టీఎంసీ లు ఎత్తిపోసే విధంగా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు ను, 30 టిఎంసి లు ఎత్తి పోసే విధంగా డిండి ప్రాజెక్టు ను నిర్మిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే దిగువ నా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్, వెలిగొండ, హంద్రీనీవా, తెలుగుగంగ, గాలేరునగరి, ఎస్ఆర్బిసి ప్రాజెక్టులకు నీరు అందక 48 లక్షల ఎకరాల సాగుభూమి..బీడు భూమి గా మారుతుందన్నారు. తాగునీటికి కటకట ఏర్పడుతుందని, పరిశ్రమలకు నీరు అందదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదశ్ తార్ ఎడారి అవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. 27వ తేదీ జరగబోయే సమావేశంలో తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వైకాపా నాయకులను పరామర్శించిన వైయస్ మనోహర్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్** పులివెందుల పట్టణంలోని పలు వార్డులో వైకాపా నాయకులను మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వర ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఆదివారం పరామర్శించారు. పులివెందుల మాజీ కౌన్సిలర్ నూరుల్లా కారు ప్రమాదంలో గాయాలు కావడంతో ఆయన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నూరుల్లా నివాసానికి వెళ్లి వారు ఆయనను పరామర్శించారు. వైకాపా నాయకుడు, 20వ వార్డు కౌన్సిలర్ భర్త నర్సారెడ్డి రెండు మోకాళ్ళ ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ంక్రిస్టియన్ లైన్ లో ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన రత్నం (65) కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాదర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి

## విద్యుత్తు డీఈ ప్రసాద్ రెడ్డి





పులివెందుల మేజర్ న్యూస్ ప్రధానమంత్రి సురేఖ యోజన పథకాన్ని ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ డీఈ ప్రసాద్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని స్థానిక డివిజను కార్యాలయంలో ఆదివారం ప్రజాకళా వేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లును కూడా ఆదా చేసుకోవచ్చని అలాగే ఈ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని అప్లై చేసుకోవాలంటే సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అందులో 78,000 ప్రభుత్వ రాయితీ ఇస్తుందని మరియు బీసీలకు 20వేల రూపాయలు రాయితీ ఇస్తుందని మిగతావారు కూడా ఈ పథకానికి అప్లై చేసుకుంటే తక్కువ వడ్డీకే బ్యాంకులు రుణాలు అందిస్తాయని తెలిపారు. అలాగే ఉచిత సూర్యకాంతిని సద్విని చేసుకోని విద్యుత్తు బిల్లును కూడా తగ్గించుకోవచ్చని అయితే రూఫ్ టాప్ సోలార్ పవర్ టెక్నికల్ నెట్ మీటరింగ్ సిస్టం ద్వారా కరెంట్ బిల్లు సుమారు 90 శాతం తగ్గించుకోవచ్చని సోలార్ ఉపయోగించడం వలన బొగ్గు ఆధారిత విద్యుత్తు తగ్గుతుందని దీనివలన సహజ వనరులను భావితరాల కొరకు పొదుపు చేసిన వాళ్ళం అవుతామని దీనివలన వాతావరణ కాలుష్యం తగ్గుతుందని సౌరశక్తి నిరంతరం ఉత్పత్తి అయ్యే శక్తి కాబట్టి దీని నిర్వహణ ఖర్చు చాలా తక్కువ అవుతుందని ప్రారంభంలో పెట్టుబడి మాత్రం ఉంటుందని సోలార్ అనుగ్రేడ్ నెట్ ద్వారా వ్యాపార రీత్య ఇన్స్టాల్ చేసుకున్న వారికి రాయితీ లేదని మీ పెట్టుబడిని 40 సంవత్సరాలలోపు తిరిగి పొందవచ్చని సోలార్ అన్ గ్రిడ్ సిస్టం ద్వారా మనం ఉపయోగించగా మిగిలిన విద్యుత్తును ఎల క్ట్రిసిటీ గ్రిడ్ కు సోలార్ ప్యానల్స్ ఉపయోగపడుతుందని దీని జీవితకాలం సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు, లైనింగ్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్లు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించే దిశగా విజయ యాత్ర



కడప రూరల్ మేజర్ న్యూస్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే దిశగా టిడిపి నాయకులు, కార్పొరేటర్లు, జనసేన నాయకులు నగరంలో ఆదివారం ప్రభుత్వ సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటా విజయ యాత్ర నిర్వహించేందుకు కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పెన్షన్ భరోసా, అన్నా క్యాంటీన్లు, ఉచిత ఇసుక, దీపం పథకం, మత్స్యకారులకు 20,000 నగదు, తల్లికి వంద నం, డొక్కా సీతమ్మ భోజన పథకం, రేషన్ కార్డు మంజూరు, డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన ప్రజలందరికీ తెలియపరుస్తూ డివిజన్ల వారీగా విజయ యాత్రను కలసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న విద్యాశాఖధికారులు

## పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న




**కడప ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్** ఉమ్మడి వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంలు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల మభ్యపెట్టి డొనేషన్ల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని సీబిఎస్ఈ,వసతి గృహాల,ప్లే స్కూల్స్ అనుమతి లేకపోయిన నిర్లక్ష్యం వహిస్తున్నారని, కావున కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖధికారులైన ఆర్జెడి, డీఈవోలు, డిప్యూటీ డిఇఓలు వత్తాసు పలుకుతున్నారని తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తక్షణమే వైఎస్ఆర్ కడప,అన్నమయ్య జిల్లాలోని ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న డిమాండ్ చేశారు. కడప నగరంలోని పిడిఎస్ యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వైయస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలో కడప నగరం, ప్రొద్దుటూరు, బద్వేల్, పులివెందల, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు విరుద్ధంగా విద్యార్థులకు అర్హత పరీక్షలు నిర్వహించి, సిబిఎస్ఈ అనుమతి లేకపోయినా, ఉన్నట్లు చెబుతూ ప్లే పాఠశాలలు గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయని అదేవిధంగా వసతి గృహాలు అనుమతి లేకపోయినప్పటికీ సొంతంగా వసతి గృహాలు నిర్వహిస్తున్నా రన్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు పేరుతో అధిక ధరలు విక్రయాలు జరుపుతున్న జీఎస్టీ, విజిలెన్స్,ఏసీబీ అధికారులు మామూలు మత్తులో మునిగిపోయారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారుల కూత వేట దూరంలో ఉన్న పాఠశాలలు తనిఖీ చేసే దానికి కూడా సమయం లేదని అదే విద్యా శాఖ అధికారులు కనీస సౌకర్యాలు లేకుండా కొత్త పాఠశాలలు అనుమతుల విషయం లో, రెన్యువల్ పాఠశాలలు విషయంలో లక్షలాది రూపాయలు యాజమాన్యాల దగ్గర తీసుకుంటున్నారని వారు ఆరో పించారు. కావున జిల్లా కలెక్టర్లు స్పందించి ఫీజుల దోపిడీ అడ్డుకట్ట వేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ అన్నమయ్య జిల్లా పిడిఎస్ యు నాయకులు మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు .

# కలుషితపు నీరు తాగి ఎద్దు అక్కడికక్కడే మృతి



**పులివెందుల -వేముల మేజర్ న్యూస్** గోందిపల్లె గ్రామానికి చెందిన రైతు దయ్యం శేఖర్ రెడ్డి ఎద్దుల తో వ్యవసాయం చేస్తూ జీవనం గడిపే వాడు అనుకోకుండా ఆదివారం మధ్యాహ్నం సమయంలో పొలం దగ్గర ఎద్దు గెట్టున మేస్తు డమ్ములో రసాయనాలతో కలిపిన నీరు ఎద్దు దప్పిక తో త్రాగడం వలన కొద్దిసేపటికి ఎద్దు నెలపడి పోయింది అని రైతు పేర్కొన్నారు. బాధిత రైతు పూర్తీ కథనం ప్రకారం ఎద్దు రూ.80 వేలు విలువగల దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన గొందిపల్లే లోని రైతు పొలంలో చోటుచేసుకుంది.కలుషితపు నీరు త్రాగిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లుగా కన్నీరుమున్నీరైయ్యాడు. ప్రభుత్వం, సంబంధించిన ఉన్నతాధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నాడు.

# కడప ఆఫీసర్స్ క్లబ్‌లో గ్రంథాలయం ప్రారంభం



**కడప టౌన్ మేజర్ న్యూస్:** నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం విశ్రాంత పంచాయతీ రాజ్ ఇంజనీర్ గంగల కేశవులు, కవి కల్లూరు ఎల్లారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సిపి బ్రౌన్ గ్రంథాలయం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ మాట్లాడుతూ కడప ఆఫీసర్స్ క్లబ్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పుస్తకపఠనం మంచి వ్యాపకం కావాలని ఆకాంక్షించారు. మంచి పుస్తకం మంచి మిత్రునితో సమాన మని తెలిపారు. గ్రంథాలయం ఏర్పాటుకు అద్దాల బీరువాని ఏర్పాటు చేసిన గంగల కేశవులు, అల్పాహారం ఏర్పాటు చేసిన బాలఎల్లారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి కేశవులు, ఎల్లారెడ్డిలకు క్లబ్‌సభ్యులు పూల మాలలు వేసి శాలువాతో సత్కరించారు. విశ్రాంత విద్యాశాఖ అధికారి నరసింహులు పుస్తకాల కొనుగోలుకు రూ.10 వేలు విరాళం ప్రకటించారు. పలుపుస్తకాలను జానమద్ది విజయ భాస్కర్, కేశవులు, ఎల్లారెడ్డి, వనమాల రవీంద్ర కానుకగా ఇచ్చారు. ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు లేబాక మధుసూదన రెడ్డి, సుబ్బరామయ్య, సోమి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, చిన్నపరెడ్డి, శ్రీరామిరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు

# సంక్షేమ వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలి

## రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు యాదవ్



కడప ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని, ఎస్సీ ఎస్టీ బీసీ వార్డెన్స్ అక్రమాస్తులపై సిట్ విచారణ చేపట్టాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం ఆర్ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక కడప నగరంలోని నెంబర్ 3 హాస్టల్ ను ఆర్ఎస్ఎఫ్ బృందం పరిశీలించారు అనంతరం విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డి.యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులను సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయన్నారు కాస్మోటిక్, మెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు ఖాళీగా ఉన్న కమాటి, వాచ్మెన్, వంట మాస్టర్, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఒకే వార్డెన్ కు రెండు మూడు హాస్టల్స్ ఇన్చార్జులుగా ఇచ్చి అవినీతి అక్రమాలకు పాల్పడడానికి జిల్లా అధికారులే లైసెన్సులు ఇస్తున్నారని మండిపడ్డారు ఇన్చార్జిల పాలనలో ఒక్క హాస్టల్ నుండే ఇతర హాస్టల్స్ కు భోజనం సప్లై చేయడం ఏమిటంటే వారు ప్రశ్నించారు ఫిల్టర్ వాటర్ ఇవ్వకపోవడం కారణంగా విద్యార్థులు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు బాత్రూంలో శుభ్రం చేయకపోగా కనీసం డోర్లు కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు తక్షణమే జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ వార్డెన్స్ ఆస్తులపై సిట్ విచారణ చేపట్టాలని, ఇన్చార్జి వార్డెన్ కు కొమ్ము కాస్తున్న జిల్లా సంక్షేమ వసతి గృహాల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# యువత పోరును విజయవంతం చేయాలి

## పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల మేజర్ న్యూస్ నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 23వ తేదీన కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పోరుమామిళ్ల వైఎస్ ఆర్సిపి కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే 'యువత పోరు'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే యువత పోరు పోస్టర్లను ఎమ్మెల్సీ డీసీ గోవింద్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి యువజన విభాగం ఎంతో కీలకమని అన్నారు.చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసానికి గురవుతున్నా రన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 23వ తేదీన కడప కలెక్టరేట్ ఎదుట యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యువతను భాగస్వామ్యం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కేసులకు ఎవరూ భయపడొద్దని సూచించారు. ప్రజల పక్షాన పోరాట చేయాలని యువజన విభాగం నేతలకు సూచించారు. ఈనెల 23వ తేదీన యువజన విభాగం ఆధ్వర్యంలో కడప జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు చిత్తాగిరి ప్రణీత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, జిల్లా యువజన విభాగ కార్యవర్గ సభ్యుడు జగదీష్ రెడ్డి, మండల వాలంటరీ వింగ్ అధ్యక్షులు శివ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పొదిలి మస్తాన్ మనీ, జిల్లా విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ నెంబర్ కే శివకుమార్, సెల్ పాయింట్ భాష, రసూల్, వెంకటేష్, ఆది బోయిన శ్రీకాంత్‌యాదవ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**లింగాల మేజర్ న్యూస్ :** లింగాల మండలంలోని పెద్ద కుడాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984 - 1985 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1985 బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు వారి ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో బాల్య స్మృతులను పంచుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు ఈనాడు గుర్తుతెచ్చుకొని ఒకరికొకరు ఎంతో ఆప్యాయంగా ఎంతో సంతోషంగా అక్కడనే భోజనాలు చేసుకుని ఎంతో సంతోషంగా గడిపామని వారు అన్నారు. ఇలా ప్రతి ఒక్కరు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకోవాలని ఎంతో ఉత్సాహంగా ఉంటుంద ని వారు అన్నారు. అలాగే పెద్ద కుడాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ అపూర్వ కలయిక లో ఆనాటి ఉపాధ్యాయులు శ్రీ కొండ్రెడ్డి వీరారెడ్డి మరియు వారి సతీమణి వెంకట లక్ష్మమ్మ వారిని ఘనంగా సత్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు రాజశేఖరరెడ్డి, పద్మనాభ రెడ్డి కార్యక్రమానికి సమన్వయకర్త లుగా వ్యవహరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త రాజగోపాల్ రెడ్డి పాఠశాలకు లక్షరూపాయల విరాళం ప్రకటించారు.




# ఏ.పి & తెలంగాణా ప్రభుత్వాలు
# జాబ్ కేలండర్ విషయం ఏంటి?

**చెప్పటానికి చేయడానికి చాలా తేడా ఉంటుంది. ఇన్‌స్టంట్ ప్రయోజనాలనాశించి చెప్పేస్తారు. తీరా ప్రయోజనాలు పొందిన తర్వాత చేయడానికి నత్తనడకను అనుసరిస్తారు. నిరుద్యోగ నిర్మూలన అనేది ఎన్నికల మానిఫెస్టోలలో ఎవర్‌గ్రీన్ విషయం. ఇది ఎప్పుడూ రాజకీయ నాయకుల ప్రసంగాలలో నానుతూ ఉండాలి. తీరా గెలిచిన తరువాత నిరుద్యోగ నిర్మూలన కాస్తా చివరి ఆప్షన్ అవుతుంది.**

ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తాము గెలిచిన తరువాత బోలెడన్ని ఉద్యోగాలతో కేలండర్‌లు అన్నారు. మొదటి ప్రయారిటీ అన్నారు. గెలిచిన తరువాత సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాల కేలండర్ కొరకు నిరీక్షణలు, పోరాటాలు తప్పడం లేదు. ప్రభుత్వాలు అనేవి ఏ పార్టీల నుండైనా రానీయండి. అన్ని ప్రభుత్వాల వైఖరి ఒక్కటే. వర్షం అనేది అదనులో పదునుగా కురవాలి. అదను తప్పిన తరువాత పడే వర్షం సముద్రం పాలవుతుంది. మనకు ఉపయోగపడదు. ఉద్యోగా ర్థులకు కూడా ఒక సర్టైన్ పిరియడ్ ఉంటుంది. ఆ తరువాత వారి వయసులు దాటిపోతాయి. ఇది ప్రభుత్వాలు గమనించాలి.

**తెలంగాణ**

తెలంగాణలో ఇంచుమించుగా గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు అన్నింటికి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చేసారు. మరికొన్ని రిక్రూట్‌మెంట్ తుదిదశలో ఉన్నాయి. తదుపరి సుమారు 27వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు రానున్నాయని సమాచారం. అలానే గ్రూప్-4 మరియు గ్రూప్-3 కలిపి ఒకటే రిక్రూట్‌మెంట్ చేయాలనేది తెలంగాణా ప్రభుత్వ ఆలోచనలా ఉన్నది. ఉద్యోగ ఖాళీల వివరాల సేకరణలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర కావస్తున్నా స్పష్టమైన జాబ్ కేలండర్ ప్రకటించడం లేదని నిరుద్యోగులు ఆందోళనలు గట్టిగానే చేస్తున్నారు. నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నప్పుడల్లా ముఖ్యమంత్రిగారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్పందిస్తున్నారు. ఆంధ్రాలో అయితే ఈ ముచ్చటే లేదు.

తెలంగాణాలో వెనకా ముందు అయినా ఖచ్చితంగా ఉద్యోగ ప్రకటనలు వస్తాయి. అవి కేలండర్ రూపంలో ఉంటే మంచిది. ఫలానా టైమ్‌లో నోటిఫికేషన్ వస్తుంది - పరీక్ష జరుగుతుంది - ఫలితాలు వస్తాయి - ఉద్యోగాలొస్తాయి అన్నదానిలో స్పష్టత ఉంటే యువత సివిల్స్ లాగా కుదురుగా కూర్చొని చదవటానికి అవకాశం ఉంటుంది. అలా కాక ఉద్యోగ ప్రకటనలు వస్తాయి.... వస్తాయి... ఎప్పుడొస్తాయి? అనే ఆకాశగంగ సిద్ధాంతం ఉంటే ఉద్యోగార్థులకు విలువైన కాలహరణం అవుతుంది.

**ఆంధ్రప్రదేశ్ - జనవరిలో కేలండర్....?**

**ప్రభుత్వాలు ఉద్యోగాల ప్రకటనల పట్ల ఉద్యోగార్థుల్లో విశ్వసనీయత కల్పించాలి. ఎన్నికలపుడే నోటిఫికేషన్లు అనే ఒక చెడ్డ సంప్రదాయాన్ని వదిలేయాలి. ఏ సంవత్సరానికా సంవత్సరం ఉన్నన్ని ఖాళీలతో నోటిఫికేషన్లు ఇవ్వాలి. వీటిని ముందుగానే కేలండరు రూపంలో ప్రకటించాలి. ఫలానా టైమ్‌లో నోటిఫికేషన్ వస్తుంది, పరీక్ష జరుగుతుంది, ఫలితాలు వస్తాయి, ఉద్యోగాలొస్తాయి అన్నదానిలో స్పష్టత ఉంటే యువత సివిల్స్ లాగా కుదురుగా కూర్చొని చదవటానికి అవకాశం ఉంటుంది.**




ఆంధ్రప్రదేశ్‌లో కూడా గత ప్రభుత్వం ఇచ్చిన అనేక ఉద్యోగ ప్రకటనలకు పరీక్షలు జరుగుతున్నాయి. ప్రస్తుతం యువత డిఎస్సీ పరీక్షలు రాస్తున్నారు. ఇవన్నీ జులై నెల వరకు ఒక కొలిక్కి తెచ్చి వచ్చే జనవరికి నూతన జాబ్ కేలండర్ ఇచ్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే గ్రూప్-1 150పోస్టులు మరియు ఎండోమెంట్ 137 పోస్టులు, ఇంకా గ్రూప్-2 కి సంబంధించి రెవిన్యూ పోస్టులు... ఇలా ఎన్నో రాబోయే కేలండర్‌లో ప్రకటిస్తారని ఉద్యోగార్థులు ఆశిస్తున్నారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్‌గారు గతంలో చేసిన యువగళం యాత్రలో ఇచ్చిన ప్రధాన హామీ ఉద్యోగాల కేలండర్ ప్రకటిస్తామనేది.

అయితే ప్రభుత్వం వచ్చి ఇటీవలే ఒక సంవత్సరం సెలబ్రేషన్స్ జరిగాయి. ఆరువేల ఉద్యోగాలకి పైబడి కానిస్టేబుల్, మెయిన్స్ పరీక్షలు ఇటీవల నిర్వహించారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఒక ఖచ్చితమైన కన్‌సర్న్ ఉన్నది అని అర్థం అవుతున్నది. అయితే సాధ్యమయినంత త్వరగా జాబ్ కేలండర్ విడుదల చేయాలని, ప్రక్రియ మొత్తం ఒక సంవత్సరంలో పూర్తి చేయాలని యువత కోరుతున్నారు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం కేలండర్ రూపంలోనే ఉద్యోగాల ప్రకటన వచ్చే జనవరికి ఉండవచ్చు. ప్రస్తుతం గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియ వేగంగానే జరుగుతున్నది.

**నమ్మకం కలిగించాలి :-**

ప్రభుత్వాలు ఉద్యోగాల ప్రకటనల పట్ల ఉద్యోగార్థుల్లో విశ్వసనీయత కల్పించాలి. ఈ విశ్వసనీయత ఉద్యోగ ప్రకటనలు వెలువడినప్పటినుండి రిక్రూట్‌మెంట్ పూర్తయ్యేవరకు చూపగలగాలి. సంవత్సరాలకు సంవత్సరాలు ఉద్యోగాల ప్రకటనలకు వేచి చూడాలి అంటే అంత నిగ్రహం, ఓర్పు యువతకు ఉండవు. ఇలా వేచి చూసే పద్ధతి కూడా మంచిది కాదు. ఒక వన్ ఇయర్ ఓకే, సరే రెండు సంవత్సరాలు. కానీ పంచవర్ష ప్రణాళికలాగా ఐదేసి సంవత్సరాలు పడితే అసలు ఆశే చచ్చిపోతుంది. గొప్ప గొప్ప చదువులు చదివి కూడా పదివేలకు, పదిహేను వేలకు ఉద్యోగాలు చేసుకుంటూ కనీస జీవన ప్రమాణాలు లేకుండా పోతాయి. శక్తియుక్తులుండి కూడా ప్రభుత్వ పథకాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఎ.పి.లో పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం పరిఢవిల్లాలని అనే కార్యక్రమం (3-పి) జరుగుతోంది. దీనివల్ల ఉద్యోగాలు వస్తాయి. కానీ ఆ ఉద్యోగాలలో ఇచ్చే జీతాలు జీవన ప్రమాణాలను మార్చబడవు. సంవత్సరానికి ఒకసారి, క్రితం సంవత్సరం ఖాళీ అయిన ఉద్యోగాలకు (ఎన్ని ఉంటే అన్ని) ప్రకటనలు ఇస్తే ఇష్టం ఉన్నవారు స్పందిస్తారు. లేకపోతే లేదు. ప్రభుత్వాలు ఈ ఒక్కపని చేస్తే చాలు. కేలండర్ ఇస్తే చాలు. ఎవరయితే కష్టపడి చదువుకుంటారో వాళ్ళకి ఉద్యోగాలు వచ్చేస్తాయి. రాని వాళ్ళు వేరే ఆప్షన్స్ చూసుకుంటారు. ప్రభుత్వంపై ఒత్తిడి ఉండదు.

ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చిన్న లాజిక్ మిస్సవుతున్నాయి. ఎన్నికలపుడే నోటిఫికేషన్లు అనే ఒక చెడ్డ సంప్రదాయాన్ని వదిలేయాలి. ఏ సంవత్సరానికా సంవత్సరం ఉన్నన్ని ఖాళీలతో నోటిఫికేషన్లు ఇస్తే ప్రభుత్వ బాధ్యత తీరుతుంది. అది కూడా కేలండర్ రూపంలో ఉంటే విశ్వసనీయత పెరుగుతుంది. మనదేశంలోని కొన్ని రాష్ట్రాలు కర్ణాటక, తమిళనాడు ఆల్రెడీ కేలండర్‌ల ప్రకటనలు జారీ చేస్తూ రిక్రూట్ చేస్తున్నాయి. ఈ బాటలో మన ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎందుకు ప్రయత్నించకూడదు? దీనికి కావల్సిందల్లా ప్రభుత్వాల్లో గట్టి చిత్తశుద్ధి.



హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238

# వీక్లీ రౌండప్

## అంతర్జాతీయం

**జూన్ 2 - జూన్ 8**

- కెనడాలో జరగనున్న జీ-7 దేశాల శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీమోదీని కెనడా ప్రధాని ఆహ్వానించారు.
- బంగ్లాదేశ్‌లోని మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఆ దేశ జాతిపితగా బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ పేరును తొలగించింది
- దక్షిణ కొరియాలో జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో లిబరల్ పార్టీ అభ్యర్థి లీజే-మ్యుంగ్ 85 శాతానికిపైగా ఓట్లతో ఘన విజయం సాధించారు
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంగోలియా ప్రధాని ఓయున్ ఎర్డెన్ పదవికి రాజీనామా చేశారు.
- ఇటలీలోని సిసిలీలో మంచుతో కప్పబడిన 'మౌంట్ ఎట్నా' అగ్నిపర్వతం విస్ఫోటనం చెందింది.
- హైదరాబాద్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ సొంతం చేసుకున్నారు.
- ఉక్రెయిన్ చేపట్టిన 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్'కు ప్రతీకారంగా ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాలపై రష్యా సేనలు 400కు పైగా డ్రోన్లు, 40కి పైగా క్షిపణులను ప్రయోగించాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించారు.
- కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతున్నవేళ, వైరస్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా పరిశోధకులు 'ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్'ను అభివృద్ధి చేశారు.
- భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగబోయే టెస్టు సిరీస్‌లలో విజేతకు ఇచ్చే ట్రోఫీ పేరు ఇక నుంచి టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీగా మారనుంది.
- ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను అమెరికా యువ సంచలనం కోకో గాఫ్ గెలుచుకుంది.

## జాతీయం

**జూన్ 2 - జూన్ 8**

- జమ్ము-శ్రీనగర్‌ను అనుసంధానం చేసేందుకు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సింగిల్ ఆర్చ్ రైల్వే వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.
- ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
- అమర్‌నాథ్ యాత్రను ఈ ఏడాది జూలై 3 నుంచి ఆగస్టు 9 వరకు కేవలం 38 రోజులు మాత్రమే నిర్వహించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది.
- బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ విజయోత్సవ సంబరంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందారు.
- త్రివిధ దళాలకు ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను ప్రదానం చేశారు.
- బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్లను ఆగస్టు 14లోపు ముగించాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది
- అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్‌లో ఆర్సీబీ.. ఆరు పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. 18 ఏండ్ల విరామం తర్వాత జూన్ 3, 2025న ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రూ.20 కోట్ల ప్రైజ్ మనీని, రన్నరప్ పంజాబ్ కింగ్స్‌కు రూ. 12.5 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

ఫెయిర్ ప్లే అవార్డు (చెన్నై సూపర్ కింగ్స్) రూ.10లక్షలు
ప్రసిద్ధ్ కృష్ణ (పర్పుల్ క్యాప్) రూ.10లక్షలు
సాయి సుదర్శన్ (ఆరెంజ్ క్యాప్) రూ.10లక్షలు
సూర్యకుమార్ యాదవ్ (మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్) రూ.15లక్షలు.

# అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల ఉక్కుపాదం

## 15 రోజుల్లో 43మంది అరెస్టు, రూ. 2,11,930 నగదు స్వాధీనం

### జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్‌కుమార్




**కడప క్రైమ్-మేజర్ న్యూస్** అసాం ఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో గత 15 రోజుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను జిల్లా ఎస్పీ వివరించారు. జిల్లాలో గత 15 రోజుల్లో 13 మట్కా కేసుల్లో మొత్తం 43 మంది అరెస్టు చేసి రూ. 2,11,930 నగదు స్వాధీనం చేసు కున్నారు. జూదమాడుతున్న మొత్తం 106 మందిని అరెస్టు చేసి రూ. 1,82,650 నగదు స్వాధీనం చేసుకుని 19 కేసులు నమోదు చేయ డం జరిగిందని ఎస్.పి తెలిపారు. జిల్లాలో రెండు క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న 8 మందిని అరెస్టు చేసి రూ. 76,000 నగదు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేయడం జరిగింది.

**రెండు కిలోల గంజాయి స్వాధీనం, 5 మంది అరెస్టు:**

గంజాయి విక్రయిస్తున్న 5 మందిని అరెస్టు చేసి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య పానంపై పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ముమ్మర దాడులు నిర్వహించి 235 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 52 మందిపై కేసులు నమోదు చేశారు.

**కోడి పందేలపై దాడులు..**

3 కోడి పందేల కేసుల్లో మొత్తం 21 మందిని అరెస్టు చేసి రూ. 81,250 నగదు స్వాధీ నం చేసుకోవడం జరిగింది. కాగా, అక్ర మంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి 3.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసు కున్నారు. అసాంఘిక కార్యక్రమాల నిర్మూల నకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు తెలియచేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ తెలిపారు.

# విద్యతోనే ఉన్నత స్థాయి సాధ్యం

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: విద్యతోనే ఉన్నత స్థాయి సాధ్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వినాయకనగర్‌లోని దేవాం గ కళ్యాణ మండపంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 13వ సంవత్సరం పది, ఇంటర్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని సూచిం చారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఆ దశలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, ఏకా గ్రతతో చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని వివరించారు. అనంతరం 10వ తరగతిలో, ఇంటర్మీడియట్‌లో ప్రతి గ్రూప్ నందు అత్య ధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యా ర్థులకు విడివిడిగా ప్రథమ బహుమతి 5,000, ద్వితీయ బహుమతి 4,000, తృతీయ బహుమతి 3,000, కన్సొలేషన్ బహుమతి 2,000 చొప్పున దాదాపు 64 మందికి సుమారు 1,62,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు వుట్టి నాగశయనం, వుట్టి నాగయ్య, సందు శివ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కంపు కొడుతున్న కేసీ కాలువ

## ముక్కులు మూసుకొని వెళ్లాల్సిందేనా!




**కడప రూరల్ మేజర్ న్యూస్:** కెసి కాలువ ఒకనాడు అనాధలకు, అభాగ్యులకు స్నాన వాటికగా ఉపయోగ పడేది. నేడు కేసి కాలువ డంపింగ్ యార్డును తలపిస్తుంది. వ్యర్థాలను ఎక్కడ వేసినా ప్రశ్నించే వారు లేకపోవడంతో పరిసర నివాసాలలో వాడి పడేసిన వ్యర్థాలను బిల్డప్ సర్కిల్ నుండి వినాయక సర్కిల్ మధ్యన ఉన్న కేసి కాలువ లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిల్, క్రిమిసంహారక మందుల డబ్బాలు, గోనె సంచులు, కోళ్ల వ్యర్థాలు పడేయడంతో కాలువ నిండి, నీరు తొలగక, వ్యర్థాలు కుళ్ళి దుర్గంధం వెదజల్లుతుంది. రోడ్డుపై నడవాలన్న ముక్కులు మూసుకొని పరిగెత్తాల్సిన పరిస్థితి. రోడ్ సైడ్ దుకాణాలు నిర్వహించుకోవాలన్నా, ఈగలు, దోమలు, దుర్గంధం వాసనలతో నిలువలేక ఉన్నామని దుకాణా యజమానులు ఆవేదనలు వ్యక్తపరుస్తున్నారు. వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తూ, కంపు కెసి కాలువతో ఉండలేక, వెళ్లలేక చస్తున్నామని పెదవి విరుస్తున్నారు. వ్యర్థాలను విసిరే సమయంలో ప్రశ్నిస్తే, మీకేంటి అంటూనే కాలువలో పడేసి చేతులు దులుపుకుంటున్నారని, దుకాణ యజమానుల నుండి వినవస్తున్నాయి. వ్యర్థాలను కేసి కాలువలో వేస్తే జరిమానా తప్పక చెల్లించే విధంగా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటే తప్ప, కేసీ కాలువ శుద్ధి కాదని పలువురు అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, వ్యర్థాలను పడవేసే వ్యక్తులపై జరిమానా విధించాలని పలువురు కోరుతున్నారు.

# నేటి నుంచి సబ్సిడీపై జీలగలు పంపిణీ..!

### వ్యవసాయ అధికారి పి. అమర్నాథ్ రెడ్డి



**దువ్వూరు, మేజర్ న్యూస్:** మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన సబ్సిడీ జీలుగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగు తుందని మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి పేర్కొ న్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ సబ్సిడీ జీలగలు పంపిణీ సోమవారం నుంచి మొదటి విడతలో భాగంగా రైతు సేవా కేంద్రం పరిధిలోని చింతకుంట -1, చింతకుంట 2, అన్నపుశాస్త్రుపుపల్లె, ఎం.ఎర్ర బెల్లె గ్రామాల పరిధిలలో ఉన్న బుక్కయపల్లె, భీమునిపాడు,మాచనపల్లె గోపులాపురం, బల్లకివారిపల్లి, గ్రామాలకు సబ్సిడీ పైన జీలగలు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వరి వేసే రైతులు తీసు కున్న తర్వాత జిలుగ విత్తనాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని, ఎటువంటి దుర్విని యోగం చేయకూడదని, జీలగలు పంట వేసిన తర్వాత పంట నమోదు చేయడం జరుగు తుందని ఒకవేళ పంట వేయని ఎడల సబ్సిడీ జీలుగలు తీసు కున్న రైతులకు భవిష్యత్తులో ఎటువంటి పథకాలు వర్తించ కుండా బ్లాక్లిస్టులో పెట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిలుగలు పూర్తి ధర కేజీ 123 రూపాయలు, ప్రభుత్వం సబ్సిడీ-రూ 61.50 ఫోను రైతు వాట -రూ 61.50 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. పది కేజీలు బస్తాలు వస్తాయని తెలిపారు. చెప్పిన గ్రామాలలో సోమవారం నుంచి సచివాలయాలలో జీలుగలు పంపిణీ చేస్తా మని ఏవో తెలిపారు. కావలసిన రైతులు సద్వినియం చేసుకోవాలని కోరారు.

# దళితులకు సొంత భూమి ఉండకూడదా?

## తరతరాలుగా దళితులు కూలీలుగానే ఉండాల్సిందేనా?




**కడప ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్** అనాది కాలం నుంచి దళితులు ఎక్కువ శాంతం కూలీలగానే జీవితాలు వెల్లబద్దారని, మారు తున్న ప్రపంచంలో దళితులు విద్య బుద్ధులు నేర్చుకుని సొంతంగా వ్యవసాయం చేసుకోవాలన్న ఆలోచనతో దళిత రైతులు వ్యవసాయ భూములను ప్రభుత్వం నుండి పొంది వారి భూములలో వారు వ్యవసాయం చేసుకోవటం అగ్రవర్ణాల వారికి అసూయగా మారిందని, ఆ కారణం చేతనే దళితుల భూములను బడాబాబులు ఆధీనంలోకి మార్చుకోవాలన్న ఆలోచనతోనే దళితుల భూములను అగ్రవర్ణాల వారు అనుభవిస్తున్నారని, దీనిని ఎంత మాత్రం సహించేది లేదని, రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్, అన్నారు. ఆదివారం దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం నందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఏడోవ రోజు అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన 78 సం ఐనా! పేద మనషులను, పెద్ద మనుషులు దోచుకోవడం ఏమాత్రం మారలేదని, పేదలు దళితుల భూములను, ఆస్తులను కొల్లగొట్టి అగ్రవర్ణాల కులాల వారు ఉన్నత శిఖరాలకు చేరుతున్నారని, వారి చేతులతో నష్టపోయి దళితులు మరింత దరిద్రానికి దిగజారి పోతున్నారని తెలిపారు. దళితుల పక్షాన బీసీలు, మైనారిటీలు, యువజన విద్యార్థులు అండగా ఉంటారని వారి భూమి వారికి దక్కేంతవరకు వారితో కలిసి పోరాడుతామని తెలిపారు. దీక్షలో కూర్చున్న వాళ్లు, దివాకర్, బాలకృష్ణ, మధు, చిన్న సుబ్బయ్య, హనుమంతు, కార్యక్రమంలో మడగలం ప్రసాద్, ఓబులేసు, శోభారాణి, చాంద్ బేగం రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు రెడ్డి సాయి, నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

**కడప ప్రతినిధి - మేజర్ న్యూస్** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగిం చుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్ప టికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు. కాగా, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వ్యవస్థను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్ సైట్ నందు వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వ హిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చు నన్నారు

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం..**

డయల్ యువర్ కలెక్టర్ కార్య క్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్న వించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.